సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



దీపం.. అపురూపం

మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికత, సాంకేతికతను కలబోస్తూ.. నేటి తరానికి నచ్చే రీతిలో దీపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. - 8లో



మనవడి మృతి తట్టుకోలేక తాత ఆత్మహత్యాయత్నం

ముక్కు పచ్చలారని మనవడు మృతి చెందాడని మనస్తాపం చెందిన తాత ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.416

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 313 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలి

మదనపల్లె సిటీ : యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, కార్యదర్శి పురం వెంకటరమణ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబర్ 3వతేదీన సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ విలువలకు కట్టుబడిన సంఘమన్నారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి : ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు ఈనెల 28న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రికెట్‌లో మదనపల్లెను జాతీయ స్థాయికి తీసుకెళ్లాలి



క్రీడాకారుల సమావేశంలో పాల్గొన్న ఏపీ సీనియర్ క్రికెట్ క్రీడాకారులు

మదనపల్లె : క్రికెట్‌లో మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులు పట్టణంలో చాలామంది ఉన్నారని, సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో రాణించి మదనపల్లెకు గుర్తింపు తీసుకురాగలరని ఏపీ సీనియర్ క్రీడాకారులు సిరాజ్, ఫయాజ్ అహ్మద్, ఎల్.ఎస్.ప్రసాద్‌రెడ్డి, నూర్‌అహ్మద్, రంజీ క్రీడాకారుడు షోయబ్ అహ్మద్ అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్ హోటల్‌లో కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్, ఖాదర్‌బాబా ఆధ్వర్యంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన సీనియర్, రంజీ క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు, యువతీ యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా మదనపల్లెలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, సరైన ప్రోత్సాహం లేక ఇక్కడే మిగిలిపోయారన్నారు. క్రీడాకారుల్లోని సామర్థ్యానికి సరైన ప్రోత్సాహం అందిస్తే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఆడే సత్తా మదనపల్లె క్రీడాకారులకు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.హరిప్రసాద్, వెంకటేష్, కోచ్ జనార్దన్, కేఎస్ఎస్‌బీ క్రికెట్ క్లబ్ మెంబర్లు నరిబాబాయ్, హరి, సలీమ్, హర్ష, చంద్రశేఖర్ ఆజాద్, జ్ఞానేశ్వర్, ఆడిటర్ వినోద్‌కుమార్‌రెడ్డి, బాబు, శివ, వీఆర్‌ఓ జాన్సన్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కూత ఎప్పుడో..!

- కలగా మిగిలిన సొరంగమార్గ ప్రయాణం
- ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రయాణికులు
- ప్యాసింజర్ రైళ్లు నడపని రైల్వేశాఖ





ఓబులవారిపల్లె : ఉమ్మడి కడప జిల్లా నుంచి నేరుగా రాష్ట్ర రాజధానికి వెళ్లేందుకు రైలు సౌకర్యం లేదు. తిరుపతి జిల్లా రేణిగుంట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంది. అన్నమయ్య జిల్లా, రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా కృష్ణపట్నం వరకు 133 కిలో మీటర్లు రూ. 2 వేల కోట్ల వ్యయంతో నూతన రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా నందలూరు మండలం హస్తవరం నుంచి కృష్ణపట్నానికి రైలు మార్గం సర్వే నిర్వహించగా ఓబులవారిపల్లె నుంచి దూరం తగ్గడంతోపాటు అనుకూలంగా ఉంటడంతో ఈ మార్గాన్ని అధికారులు ఖరారు చేశారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు రైల్వే శాఖవారు నేరుగా ప్యాజింజర్ రైలును నడపించడం లేదు.

అడియాసలే..

2019 జూన్ 15వ తేదీన కృష్ణపట్నం మార్గంలో మొట్ట మొదట ట్రయల్‌రన్‌గా గూడ్సురైలును నడిపించారు. కొన్నేళ్లుగా కడప జిల్లా నుంచి నెల్లూరు జిల్లాకు ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైలు మార్గం కోసం రెండు జిల్లాల ప్రజలు ఎదురు చూశారు. నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నెల్లూరు జిల్లాలోని తన సొంత గ్రామం మీదుగా ఈ రైలు మార్గం కోసం అప్పట్లో కృషి చేసి ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే సొరంగ మార్గంలో ప్రయాణించాలని దాదాపు ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి కడప జిల్లా, నెల్లూరు జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయితే రైల్వే శాఖ వారు ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ప్రవేశ పెట్టలేదు. దీంతో సంవత్సరాలుగా ప్రజలు ఎదురు చూస్తున్న టన్నెల్ ప్రయాణం కలగానే మిగిలిపోయింది. ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ఏర్పాటు చేస్తే ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుంది. అంతే కాకుండా రాష్ట్ర రాజధానికి నేరుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది.

సరుకు రవాణా కోసమే కృష్ణపట్నం రైలు మార్గం

ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు రైలు మార్గం కేవలం గూడ్స్‌రైలు కోసమే ఏర్పాటు చేశారు. గతంలో రేణిగుంట నుంచి కృష్ణపట్నం పోర్టుకు గూడ్స్‌రైళ్లు ప్రయాణించాలంటే దూరంతో పాటు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు ఎక్కువగా ఉండేవి. ఈ మార్గాన్ని సర్వేచేసి ఏర్పాటు చేయడంతో దూరంతో పాటు రైళ్ల రద్దీ కూడా తగ్గింది. నిత్యం దాదాపు 15 నుంచి 20 గూడ్స్ రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. షిప్పుల ద్వారా విదేశాలకు సరుకులు ఈ మార్గంలో రవాణా చేస్తున్నారు. మార్గ మధ్యంలో పలు రైల్వే స్టేషన్లు ఉన్నా కేవలం సిగ్నల్ వ్యవస్థ మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు వీలుగా రైల్వేస్టేషన్‌లు ఇప్పటికీ నిర్మించలేదు. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు ఈ మార్గంలో నెల్లూరుకు డెమో ప్యాసింజర్ రైళ్లను నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే టన్నెల్

ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం రైలు మార్గం 2005-2006వ సంవత్సరంలో మంజూరైంది. ఈ మార్గం మధ్యలో చిట్వేలి మండలం చెర్లోపల్లె వద్ద అటవీ ప్రాంతంలో కొండ వద్ద దాదాపు 6.6 కిలో మీటర్ల పొడవు, 1.5 కిలో మీటర్ల పొడవుతో రెండు సొరంగ మార్గాలను ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ ఆస్ట్రేలియన్ టెక్నాలజీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఇది దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద రైల్వే సొరంగ మార్గం. లోపల వెలుతురు, ఆక్సిజన్ వచ్చేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రత కల్పించారు. భారతదేశంలో అతి పెద్ద రైల్వే సొరంగ మార్గం 11.21 కిలో మీటర్ల జమ్మూ కాశ్మీర్‌లోని పీర్‌పంజాల్‌లో ఉంది.

రైల్వేశాఖ మంత్రి దృష్టికి..



కృష్ణపట్నం మార్గంలో ఓబులవారిపల్లె మీదుగా నెల్యూరుకు ప్యాసింజర్ రైలు నడపాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లాము. ఆయన సానుకూలంగా స్పందించారు. రైల్వేశాఖ అధికారులు స్పందించి ఈ మార్గంలో ప్యాసింజర్ రైలు ప్రవేశపెట్టాలి.

- తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, గుంతకల్లు రైల్వేబోర్డు కమిటీ మాజీ సభ్యులు

టన్నెల్ ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నాం



దక్షిణ భారతదేశంలో అతి పెద్ద టన్నెల్ మార్గం మనకు దగ్గరలో ఉండి కూడా ప్రయాణం చేయలేకుండా ఉన్నాము. దాదాపు ఐదేళ్లుగా ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. ప్యాసింజర్ రైలు కోసం సంవత్సరాలుగా వేచి ఉన్నాం. ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు స్పందించి టన్నెల్ మార్గంలో డెమో రైలు నడిపించాలి.

- శ్రీరామ సుధాకర్, ఉపాధ్యాయుడు, ఓబులవారిపల్లె.

రాజధానికి నేరుగా రైలు సౌకర్యం కల్పించండి



ప్రస్తుతం రాష్ట్ర రాజధానికి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరు జిల్లా రేణిగుంట మీదుగా వెళుతుంది. కృష్ణపట్నం రైలు మార్గంలో విజయవాడకు నేరుగా రైలు ఏర్పాటు చేస్తే దూరం తగ్గడంతో పాటు నేరుగా ఉమ్మడి జిల్లా ప్రజలకు రైలు సౌకర్యంగా ఉంటుంది. రైతులకు, వ్యాపారులకు ఈ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా ప్రయోజనం కలుగుతుంది.

- పున్నాటి ఈశ్వర్‌రెడ్డి, రైతు, ఓబులవారిపల్లె.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఇంటికి బైక్‌పై వెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై బీరుబాటిల్ పగులగొట్టి హత్యాయత్నం చేయబోయిన ఘటన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. బాధితుని కథనం మేరకు వివరాలు.. మండలంలోని శంకరాపురానికి చెందిన ఎ.శివశంకర్ (28) వైఎస్సార్‌సీపీ కార్యకర్త. ఆదివారం సాయంత్రం బైక్‌పై బి.కొత్తకోటకు వచ్చి తిరిగి శంకరాపురం వెళ్తుండగా పాత పెట్రోలు బంకు వద్ద బీరంగి గ్రామం టీడీపీకి చెందిన హరిప్రతాప్ బైక్‌ను ఆపి మాట్లాడాలని చెప్పాడు. అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలు కార్తీక్, జగదీష్‌లు గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు చెందిన లక్ష్మిపతిరెడ్డితో టీడీపీ వాళ్లకు జరిగిన గొడవలో లక్ష్మిపతిరెడ్డికి సపోర్టు చేస్తావా..ఇప్పుడు మా ప్రభుత్వం ఉంది ఏం చేస్తావంటూ ఒక్కసారిగా ముగ్గురు దాడికి యత్నించారు. ఏం జరుగుతోందో తెలిసేలోపే బీరు బాటిల్‌ను పగులగొట్టి పొడిచేందుకు ప్రయత్నించగా శివశంకర్ తప్పించుకోబోగా తలపై పగిలిన బాటిల్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వెంటనే వెళ్లి ఆస్పత్రిక వెళ్లమని పోలీసులు చెప్పడంతో స్థానిక సీహెచ్‌సీకి వెళ్లగా వైద్యులు చికిత్స అందించారు. బాధితుడిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, నాయకులు నక్కా మహేష్, కొత్తపల్లె సాయి తదితరులు పరామర్శించారు. దాడిపై పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఆస్పత్రిలో శివశంకర్

పోరాటాల ద్వారానే రాజ్యాధికారం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

రాయచోటి అర్బన్ : రాజ్యాధికారాన్ని దక్కించుకునేలా పేదలు, కార్మికులు సంఘటితంగా పోరాటాన్ని నడపాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కేజీఎస్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలు జరిగాయి. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. బూర్జువాలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల చేతుల నుంచి శ్రామిక, కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, శ్రామికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్, మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, పెత్తందారి ధోరణి కారణంగానే ఇజ్రాయిల్- పాలస్తీనా, రష్యా - ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కడప- బెంగళూరు రైల్వేమార్గం నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరని అలసత్వాన్ని వహిస్తుండడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు రామాంజులు, రవికుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహులు ప్రసంగించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, వెంకటరామయ్య, రాజమ్మ, జావిద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షుడు చంద్రశేఖర్, హరిశర్మ, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత గఫూర్

సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ లక్ష్యం

- త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 10 నూతన ఆర్టీసీ బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని నూతన బస్సులను ప్రారంభించి ప్రజలకు సులభమైన రవాణా సేవలను అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. గతంలో గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలకు కూడా ఆర్టీసీసేవలను కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాయచోటి డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు ఇంద్ర బస్సులు, మదనపల్లె-1 డిపో నుంచి ఒక సూపర్ లగ్జరీబస్సు, ఒక ఎక్స్‌ప్రెస్, మదనపల్లె -2 డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్, పీలేరు డిపో నుంచి ఒక ఎక్స్‌ప్రెస్, పుంగనూరు డిపో నుంచి రెండు పల్లెవెలుగు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీటీపీఓ రాము, డీఎం ధనుంజయ, టీడీపీ నాయకుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, పలువురు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఊపి నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

క్రీడలపై కూడా శ్రద్ధ పెట్టండి

రాయచోటి టౌన్ : చదువుతో పాటు క్రీడలపై కూడా శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆదివారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -17 కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి అన్నమయ్య జిల్లాతో పాటు రాయచోటికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బంతి పూల ధరలు పతనం

- మార్కెట్లో కిలో రూ.15
- వర్షాలతో పుంజుకోని పూల ధరలు
- దీపావళి, కార్తీకమాసంపైనే రైతుల ఆశలు



చెరువుమొరవపల్లెలో సాగు చేసిన బంతిపూల తోటలు

గుర్రంకొండ : బంతిపూల ధరలు మార్కెట్లో భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధరలు రూ.15కు పడిపోయాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో మార్కెట్లో పూల ధరలు పుంజుకోకపోవడంతో రైతులు నష్టపోయారు. రోజురోజుకు పూల ధరలు తగ్గిపోతుండడంతో రానున్న దీపావళి, కార్తీకమాసం పండుగ సమయంలోనైనా పూలధరలు పుంజుకుంటాయనే ఆశతో రైతులు ఉన్నారు.

1048 ఎకరాల్లో పూల సాగు

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో1048 ఎకరాల్లో బంతి పూలతోటల సాగు చేపట్టారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో తోటలు అదునుకొచ్చి పూల దిగుబడి ప్రారంభమైంది. ఎకరం పూలతోట సాగు చేయాలంటే రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. పూలనారు కొనుగోలు నుంచి పూలు కోతకొచ్చేవరకు రైతులకు ఈపాటి ఖర్చు వస్తుంది. మార్కెట్లో కనీసం కిలో పూల ధర రూ.30 నుంచి రూ.50లోపు ఉంటే రైతుకు పెట్టుబడి సాగు అయినా చేతికొస్తుంది.

పది రోజులుగా పతనమైన ధరలు..

పది రోజులుగా మార్కెట్లో పూల ధరలు పతనమయ్యాయి. పదిహేను రోజుల క్రితం మార్కెట్లో కిలో పూలధర రూ. 70 నుంచి రూ.85 వరకు పలికింది. అనంతర పరిణామాలతో బంతిపూల ధరలు మార్కెట్లో రోజురోజుకు తగ్గిపోయాయి. ప్రస్తుతం పూలధరలు కిలో రూ.15 వరకు పలుకుతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. గతంలో ఇదే సీజన్‌లో కిలో పూల ధరలు రూ. 60 వరకు పలికాయి. అదే ఆశతో రెండు నెలలుగా పూలతోటల పెంపకం చేపట్టిన రైతులకు నిరాశే మిగిలింది.

వర్షాలకు దెబ్బతిన్న తోటలు.. గిట్టుబాటు కాని ధరలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్లో పూలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని రైతులు వాపోతున్నారు. 35 కిలోల పూల బస్తా బెంగళూరుకు తరలించాలంటే రూ. 250 వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ.15 పలుకుతోంది. ఈ లెక్కన ఒక బస్తా పూలకు రూ.525 మాత్రమే ఒక్కోసారి గిట్టుబాటు లభిస్తుంది. అంతదూరం మార్కెట్‌కు తీసుకెళ్లినా బస్తాపైన రూ.275 మాత్రమే రైతుకు గిట్టుబాటు అవుతోంది. దీంతో పూలను మార్కెట్లకు తరలించినా ప్రయోజనం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు బంతి పూల సాగుపై ఆశపెట్టుకోగా ప్రస్తుతం వారి ఆశలు అడియాశలయ్యాయి.

దీపావళి, కార్తీకమాసం పండగపై ఆశలు..

ప్రస్తుతం బంతిపూల రైతులు రానున్న దీపావళి, కార్తీకమాసం పండుగలపైనే ఆశలు పెట్టుకొన్నారు. ప్రస్తుతం పూల ధరలు పతనమవడంతో వ్యాపారులు పూల కొనుగోలుపై పెద్ద ఆసక్తి చూపించడంలేదు. ఇదే సీజన్‌లో తోటల వద్దకు వచ్చి పూలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించిన వ్యాపారులు ప్రస్తుతం పూలకొనుగోలు వైపు మొగ్గు చూపడం లేదు. జిల్లాలో సాగు చేసే పూలను మదనపల్లె, కడప, తిరుపతి, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇటీవల పూల బస్తాలతో బెంగళూరు మార్కెట్‌కు వెళ్లిన రైతుల నుంచి కనీసం వ్యాపారులు పూలను కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు దీపావళి, కార్తీక మాసం పండుగలప్పుడు గిట్టుబాటు ధరలు లభిస్తాయనే ఆశతో ఉన్నారు. పండుగ సీజన్ నెల రోజులు పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇటు నోములపండుగ ఉత్సవాలతోపాటు ఇళ్లలో పండుగ రోజున పూలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో బంతిపూలకు మంచి ధరలు వస్తాయనే ఆశ రైతుల్లో ఉంది.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పూల సాగు వివరాలు

నియోజకవర్గం	పూలసాగు (ఎకరాల్లో)
పీలేరు	325
మదనపల్లె	245
తంబళ్లపల్లె	295
రాయచోటి	55
రైల్వేకోడూరు	63
రాజంపేట	65
మొత్తం	1048

ధరలు పడిపోయాయి



ప్రస్తుతం మార్కెట్లో పూల ధరలు పడిపోయాయి. రోజురోజుకు పూల ధరలు పెరుగుతాయనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. పదిహేనురోజుల క్రితం కిలో పూల ధర రూ.85 వరకు ఉండేది. ఇప్పుడు అష్టకష్టాలు పడి మార్కెట్‌కు పూలను తరలించినా అంతంత మాత్రంగానే ఆదాయం వస్తోంది. 35 కిలోల బస్తాకు రూ. 300 కూడా మిగలడం లేదు.

- వెంకటరమణ, పూలరైతు, చింతలవారిపల్లె

వర్షాలతో పెట్టుబడి నష్టపోయాం



రెండు ఎకరాల్లో పూలతోటలు సాగు చేశాను. వరుసగా కురుస్తున్న వర్షాలతో పూలతోటలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు రూ. 3 లక్షలు ఖర్చు వచ్చింది. వర్షాలకు దెబ్బతిన్న పూలకు మార్కెట్లో డిమాండ్ లేదు. ఇప్పుడు ధర రూ.15 పలుకుతోంది.

- లక్ష్మీదేవి, పూలరైతు, మొరంపల్లె

నవంబర్ 27 నుంచి ఏఐఎస్ఎఫ్ మహాసభలు



మదనపల్లె సిటీ : ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వతేదీ వరకు సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం కన్వీనర్ భవిత, నియోజకవర్గ కార్యదర్శి వినయ్, సహాయ కార్యదర్శి భానుప్రసాద్, ఇలాహి, కార్తీక్, షారుక్, హర్ష, నవదీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : పట్టణ శివారు ప్రాంతాల్లో రూట్‌వాచ్‌లో భాగంగా తనిఖీలు చేస్తుండగా.. సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. ఆయన ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మదనపల్లె మండలం నారమాకుల తండాకు చెందిన బాణావత్ జగదీష్‌నాయక్ ద్విచక్ర వాహనంలో 50 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతని ద్విచక్ర వాహనం, సారా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐ ఎ.డార్కస్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, మహమ్మద్‌అలీ, కానిస్టేబుళ్లు మణి, మధు, దామోదర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని పాతరాయచోటికి చెందిన జమాల్ బాషా అనే గంజాయి విక్రేతను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడారు. గంజాయిని పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాయచోటి పట్టణంలోనే కాకుండా రూరల్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గంజాయిని విక్రయిస్తున్న, సేకరిస్తున్న వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తామని వివరించారు. ఈ సమావేశంలో రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


రాంబాబు మృతదేహం

బి.కొత్తకోట : భార్యతో గొడవ పడిన తర్వాత భర్త చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయిన ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ రామాంజులు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం రాజుపల్లె గ్రామం కమ్మినాయునిపల్లెకు చెందిన బి.రాంబాబు (30)కు ఏడాది క్రితం బి.కొత్తకోట సమీపంలోని బాలసానివారిపల్లెకు చెందిన స్పందన (23)తో వివాహం అయింది. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో కలతలు చెలరేగాయి. స్పందన పుట్టింటిలో కాపురం ఉందామని ఒత్తిడి చేసింది. కొంత కాలంగా పుట్టింటిలో ఉంటోంది. ఈ నేపథ్యంలో శనివారం రాంబాబు భార్య కోసం బాలసానివారిపల్లెకు వచ్చాడు. కాపురానికి రావాలని పిలవగా గొడవ జరిగింది. భార్యపై చేయి చేసుకున్నాడు. భార్య మరొకరితో చనువుగా ఉంటోందని అనుమానపడ్డాడు. తర్వాత గట్టు పంచాయతీ తరిగోడు సమీపంలోని చంద్రశేఖర్‌రెడ్డి పొలంలోని నేరేడు చెట్టుకు చీరతో ఉరి వేసుకుని రాంబాబు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం వెలుగు చూడటంతో పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దీపం.. అపురూపం

- దీపావళి వేళ.. ప్రమిదల కళ
- కొనుగోలుకు ప్రజల ఆసక్తి
- ఊపందుకున్న వ్యాపారం








రాజంపేటలో దీపాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజంపేట టౌన్/మదనపల్లె సిటీ : మరో మూడు రోజుల్లో వెలుగులు వెదజల్లే దీపావళి పండుగ రానుంది. ఒకప్పుడు దీపావళి అనగానే అందరికీ ఠక్కున గుర్తుకు వచ్చేది టపాసులు. ఇంకా చెప్పాలంటే దీపావళి పండుగకు నెల రోజుల ముందు నుంచే చిన్న పిల్లలు చిన్న చిన్న టపాసులు కొనుగోలు చేసి కాల్చుతుండేవారు. అందువల్ల నెల రోజుల నుంచి ఎక్కడో ఒక చోట టపాసుల శబ్దం వినిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల ప్రజల ఆలోచనా విధానం మారింది. దీనికితోడు టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతోపాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ కారణంగా ప్రజలు టపాసులను కాల్చడం చాలా వరకు తగ్గించారు. కేవలం దీపావళి రోజు మాత్రమే పిల్లల ఆనందం కోసం ప్రజలు టపాసులు కాల్చుతున్నారు. చాలా మంది దీపావళి పండుగ రోజు కూడా టపాసులకు దూరంగా ఉండేవారు సైతం ఉన్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.

దీపాలతోనే దివాళీ

టపాసులు కాల్చడం వల్ల కలిగే అనార్థాల గురించి తెలిసిన వారు దీపాలతోనే దివాళీ వేడుకలను జరుపుకొంటున్నారు. ఇక మహిళలు దీపాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందువల్ల వ్యాపారులు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికత, సాంకేతికతను కలబోస్తూ.. నేటి తరానికి నచ్చే రీతిలో అనేక డిజైన్లలో ఈ ఏడాది కూడా దీపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పండుగ సమీపిస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా దీపాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. దీంతో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహిళలే కాక పురుషులు కూడా ఆకర్షణీయంగా ఉండే దీపాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఆర్థిక స్థోమతకు తగ్గట్లు..

ప్రస్తుతం ఆధునికత కొత్తపుంతలు తొక్కుతోంది. అందువల్ల నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు, పాత ఇళ్లను రీమోడల్ చేసుకునేవారు వారి ఆర్థిక స్థోమతను బట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఈ కారణంగా దీపావళి సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తగ్గట్లు తమ ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలలో దీపాలను వెలిగించేందుకు మక్కువ చూపుతున్నారు. ఈ కారణంగా కాస్త ఖరీదైనా ఆకర్షణీయంగా ఉండే వెరైటీ దీపాలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు మట్టిదీపాలు మాత్రమే అందుబాటులో ఉండేవి. అయితే ఇప్పుడు మట్టి ప్రమిదలతోపాటు పింగాణి దీపాలు, విద్యుత్ ద్వారా వెలిగే దీపాలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క దీపం రూ.5 నుంచి 250 వరకు ధర పలుకుతుంది.

టెర్రకోట కళాకారుల ప్రతిభ

మదనపల్లె, సీటీఎం, అంగళ్లు ప్రాంతాల్లోని టెర్రకోట కళాకారులు ప్రత్యేకంగా దీపావళి కోసం దివ్వెలు తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటితోపాటు తులసి, ఆకు, గిన్నె, లాంతరు, నారికేళం తదితర 18 రకాల ఫ్యాబ్రిక్ పెయింటింగ్ దీపాలను వివిధ ఆకృతుల్లో రూపొందించారు. మదనపల్లె పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుమ్మరులతో పాటు హ్యాండీ క్రాఫ్ట్ షాపుల్లో దీపాలు అమ్మకాలకు పెట్టారు. రూ.10 నుంచి రూ.300 వరకు విలువైన దీపాలు ఉన్నట్లు అమ్మకందారులు తెలిపారు.

నీళ్లతో వెలిగే దీపాలు

సాంకేతికత రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతోంది అనడంలో సందేహం లేదనే చెప్పాలి. తొలుత నూనెతో.. ఆ తరువాత విద్యుత్‌తో వెలిగే దివ్వెలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఇప్పుడు ఏకంగా నీళ్లతో వెలిగే దీపాలు కూడా లభిస్తున్నాయి. నీళ్లతో వెలిగే దీపాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుండటం విశేషం. నీళ్లతో వెలిగే దివ్వె ఖరీదు కూడా స్వల్పమే. ఒక్కొక్క దివ్వె రూ.30 నుంచి 80 వరకు ఉన్నాయి.

ఇంటికి ప్రత్యేక శోభ



దీపావళి పండుగ, కార్తీక మాసం సందర్భంగా ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ప్రత్యేక శోభ సంతరించుకుంటుంది. ఒకప్పుడు చిన్నమట్టి ప్రమిదలే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు వివిధ రకాల వెరైటీల్లో ఆకర్షణీయమైన ప్రమిదలు అందుబాటులోకి వచ్చాయి. ఆకర్షణీయంగా ఉండే ప్రమిదల్లో ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ఇంటికి మరింత అందం వస్తుంది.

- దీప్తి, సచివాలయ ఉద్యోగిణి, రాజంపేట

వ్యాపారం మొదలైంది



దీపావళి పండుగ దగ్గర పడుతుండటంతో దివ్వెల కొనుగోలు వ్యాపారం మొదలైంది. దీపావళి మరుసటి రోజు నుంచే కార్తీక మాసం ప్రారంభం కానుండటంతో ప్రజలు దీపాలను కొనుగోలు చేసేందుకు బాగా వస్తున్నారు. వ్యాపారం ఇదే విధంగా జరిగితే పెట్టుబడి, ఖర్చులు పోను అంతో ఇంతో మిగులుతుంది.

-నరసింహులు, దివ్వెల వ్యాపారి, రాజంపేట

హార్సిలీహిల్స్‌పై విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- బాలికను తప్పించబోయి ప్రమాదం
- కడప పర్యాటకులు సురక్షితం


కారుపై పడిన విద్యుత్ స్తంభం, తీగలు

బి.కొత్తకోట : సరదాగా ప్రకృతి అందాలను తిలకించేందుకు వచ్చిన కడప వాసుల కారు ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన రసూల్, మహమ్మద్, రెడ్డి, మనోహర్, జాహీద్‌లు కలిసి కారులో ఉదయం ఐదు గంటలకు బయలుదేరారు. కొండపైకి చేరుకున్న వీరు ప్రకృతి అందాలను తిలకిస్తూ తిరుగుతున్నారు. వీరిలో మహమ్మద్, మనోహర్ కారులో గాలిబండ వైపు నుంచి వెళ్తుండగా.. స్విమ్మింగ్‌పూల్ వైపు నుంచి ఒక కారు రాగా, అదే సమయంలో ఒక బాలిక ఆడుకొంటూ రోడ్డుపైకి వచ్చింది. దీంతో బాలికను తప్పించే ప్రయత్నంలో కారును పక్కకు తిప్పగా అదుపుతప్పింది. జిడ్డు కృష్ణమూర్తి సర్కిల్‌లోకి దూసుకుని వెళ్లింది. అక్కడి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఒక్కసారి పర్యాటకులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్తంభం విరిగి కారుపై పడింది. విద్యుత్ తీగలు, స్తంభం పడిపోవడంతో ప్రమాదం జరుగుతుందని పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో స్తంభంతోపాటు కారు ధ్వంసమైంది. కారులో ఉన్న మహమ్మద్, మనోహర్‌లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో హార్సిలీహిల్స్‌పై విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. డిస్కం లైన్‌మెన్ రామలింగారెడ్డి ప్రమాద స్థలికి చేరుకుని విద్యుత్ స్తంభం మార్పు, దెబ్బతిన్న తీగలను సరిచేసి సరఫరా పునరుద్ధరణ కోసం ప్రయత్నాలు చేపట్టారు. అయితే సరఫరా పునరుద్ధరణకు ఒకరోజు పట్టేలా కనిపిస్తోంది. దీంతో ఆదివారం రాత్రి కొండపై అంధకారం నెలకొనే పరిస్థితి ఉంది. ఘటనపై స్థానిక పోలీసులు వివరాలు సేకరించారు.

నాకు రక్షణ కల్పించండి

ఓ దివ్యాంగుడి వేడుకోలు


నాగరాజు

మదనపల్లె : కుటుంబ సభ్యులు, పోలీసుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ ఓ దివ్యాంగుడు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటకు చెందిన డేరంగుల నాగరాజు తాను దివ్యాంగుడినని, రేషన్‌డీలర్‌గా జీవనం సాగిస్తున్నట్లు తెలిపాడు. 12 ఏళ్ల క్రితం తమ గ్రామానికి చెందిన భాస్కర్, శాంతమ్మల కుమార్తె శోభతో వివాహం జరిగిందన్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. రెండేళ్ల క్రితం అత్తమామలు కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి, స్థానికంగా విక్రయిస్తుండటంతో పోలీసులు పట్టుకున్నారన్నారు. దీంతో తన భార్య శోభ, తనకు మాటమాత్రమైనా చెప్పకుండా ఇంట్లోని లక్ష రూపాయలు తీసుకెళ్లి వారికి ఇచ్చిందన్నారు. ఈ విషయమై నిలదీసినందుకు తనతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. అప్పటి నుంచి తనపై కక్ష పెంచుకున్న భార్య, అత్తమామలు, బావమరుదులు చందు, పవన్‌లు దివ్యాంగుడైన తనపై, తన తండ్రిపై దాడిచేసి తీవ్రంగా హింసించడం చేశారన్నారు. రక్షణ కోసం బి.కొత్తకోట పోలీసులను ఆశ్రయిస్తే, వారు తనకు రక్షణ కల్పించకపోగా, భార్య, అత్తామామలు తనపై అక్రమంగా ఇచ్చిన ఫిర్యాదుతో వరకట్న వేధింపుల కేసు పెట్టి వేధిస్తున్నారని వాపోయాడు. న్యాయం కోరుతూ డీఎస్పీ, ఎస్పీని కలిసినా న్యాయం జరగలేదన్నాడు. భార్య, అత్తమామలు తనను అంతమొందించేందుకు ఇతరులకు సుపారీ ఇచ్చి హత్యాప్రయత్నంకు ఒడిగట్టారని, ఈ విషయమై తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తే, కేసు నమోదు చేయకపోగా, కనీసం విచారణ జరపలేదన్నాడు. తనకు కుటుంబసభ్యుల నుంచి ఉన్న ప్రాణహానిపై రక్షణ కల్పించాల్సిందిగా ఉన్నతాధికారులను వేడుకుంటున్నట్లు తెలిపాడు.

పాతకక్షలతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై హత్యాయత్నం


గాయపడిన అశోక్ కుమార్‌నాయుడు

గుర్రంకొండ : సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై పాతకక్షలతో హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గుర్రంకొండలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ సామనపల్లెకు చెందిన సి.అశోక్‌కుమార్‌నాయుడు(27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన గంగాధర్ నాయుడుతో అతనికి పాతకక్షలు ఉన్నాయి. గతంలో వీరి మధ్య ఘర్షణలు జరిగి నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం అశోక్‌కుమార్‌నాయుడు తన అక్క రెడ్డినివేదితను వాళ్ల అత్తిళ్లు అయిన గుర్రంకొండ మండలం నడిమికండ్రిగ పంచాయతీ చింతమాకులపల్లెలో వదిలిపెట్టడానికి ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి బయలుదేరాడు. ఇదే అదునుగా భావించిన గంగాధర్‌నాయుడు అదే గ్రామానికి చెందిన రామస్వామినాయుడుతో కలిసి ద్విచక్రవాహనంలో అశోక్‌కుమార్‌నాయుడును వెంబడిస్తూ వచ్చాడు. అశోక్‌కుమార్‌నాయుడు సాయంత్రం తన అక్కను వాళ్ల స్వగ్రామం చింతమాకులపల్లెలో వదిలిపెట్టి తిరిగి తన స్వగ్రామమైన సామనపల్లెకు బయలుదేరాడు. మార్గంమధ్యలో గుర్రంకొండ సమీపంలోని కలకడ క్రాస్ వద్ద గంగాధర్‌నాయుడు అప్పటికే అక్కడ కాచుకొని ఉండి.. అశోక్‌కుమార్‌నాయుడిని అడ్డగించి దాడికి పాల్పడ్డాడు. కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ సంఘటన జరగడంతో సమాచారం అందుకొన్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొన్నారు. పోలీసుల రాకతో గంగాధర్ నాయుడు, రామస్వామినాయుడు ద్విచక్రవాహనంపై పరారయ్యారు. తీవ్ర గాయాలపాలైన అశోక్‌కుమార్‌నాయుడిని చికిత్స నిమిత్తం పోలీసులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. కత్తిపోట్ల సంఘటన పట్టణంలో సంచలనం రేకెత్తించింది.

మనవడి మృతి తట్టుకోలేక తాత ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఆదినారాయణ

మదనపల్లె : ముక్కు పచ్చలారని మనవడు మృతి చెందాడని తీవ్ర మనస్తాపం చెంది తాత ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. చింతపర్తి పంచాయతీ ఎర్రగుంట్ల బావి గ్రామానికి చెందిన వెంకటప్ప కుమారుడు ఆదినారాయణ(48) కోడలు రెడ్డమ్మ వారం రోజుల క్రితం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో నాలుగో కాన్పులో మగ బిడ్డకు జన్మనిచ్చింది. గతంలో ఇద్దరు మగ పిల్లలు చనిపోవడం, మూడవ కాన్పులో పుట్టిన ఆడపిల్ల మాత్రమే ఉండడంతో, మగ సంతానం కోసం ఎంతో కాలంగా వేచి చూశారు. నాలుగో కాన్పులో ఆ భాగ్యం తమకు దక్కిందని సంతోషించారు. అయితే మగబిడ్డ తీవ్ర అనారోగ్యంతో ఉన్నాడని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకు వెళ్లాలని డాక్టర్లు సూచించారు. తిరుపతికి తీసుకెళ్లి అక్కడ శస్త్ర చికిత్స నిర్వహించి వైద్య సేవలు అందించారు. అయినా పరిస్థితి విషమించి శనివారం రాత్రి పసిబిడ్డ మృతి చెందాడు. ఆదివారం గ్రామంలో అంత్యక్రియలు చేశారు. మనవడి మృతిని తట్టుకోలేని ఆదినారాయణ తీవ్ర మనస్తాపం చెంది, మద్యం తాగి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

కుటుంబ సమస్యలతో మహిళ..

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. చీకలబైలు పంచాయతీ మేడిపల్లికు చెందిన వెంకటరమణ భార్య అరుణ (30) కుటుంబ సమస్యలతో ఆదివారం వేకువజామున ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనలో సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలో ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణం పొందింది. ఈ విషాద ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రంగారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్ నగర్‌లో షామీర్ అనే వ్యక్తి నివాసముంటున్నాడు. ఆయన కుమార్తె సానియా(21) ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె సరిగా చదువుకోకపోవడమే కాకుండా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే టీవీ చూస్తుండటంతో.. తండ్రి షామీర్ కళాశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని మందలించారు. మనస్తాపానికి గురైన సానియా శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి తండ్రి షామీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సానియా మృతదేహాన్ని వేంపల్లె ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

ముంపు ప్రాంతాలకు సోమశిల జలాలు

ఒంటిమిట్ట : సోమశిల ముంపు ప్రాంతాలకు వెనుకజలాలు వచ్చి చేరుతున్నాయి. మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు, ఇబ్రహీంపేట, గంగపేరూరు, చిన్న కొత్తపల్లి తదితర ముంపు గ్రామాల పొలాల్లోకి.. ఆదివారం సోమశిల వెనుకజలాలు పక్కనే ఉన్న పెన్నా నది ద్వారా వచ్చి చేరుతున్నాయి. దీంతో సోమశిల జలాశయంలో పూర్తి స్థాయిలో నీటిమట్టం చేరితే పైన తెలిపిన గ్రామాల పంట పొలాలతో పాటు తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలకు వెనుకజలాలు వచ్చి చేరుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై స్థానిక ఎంఆర్‌ఓ రమణమ్మను వివరణ కోరగా.. ప్రస్తుతానికి 10 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారని, దానివల్ల సోమశిల వెనుకజలాలు గృహాలవద్దకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే ముంపు ప్రాంతాలలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని, దీనిపై అనుక్షణం అప్రమత్తమై ఉన్నామని ఆమె తెలిపారు.


ముంపు గ్రామాల పొలాల్లోకి వచ్చిన సోమశిల వెనుక జలాలు


పెన్నపేరూరు, ఇబ్రహీంపేట మధ్య రోడ్డుపై పారుతున్న నీరు

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన మెజాన్

మదనపల్లె : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లె పంచాయతీ బెంగళూరు రోడ్డులోని సురభి కాలనీలో నివాసం ఉన్న షేక్ జబీబుల్లాకు షేక్ మెజాన్‌తో ఆరేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి అస్లాం(4), హాజీలా (2) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే భార్యభర్తలు తరచూ కుటుంబ సమస్యల కారణంగా గొడవపడేవారు. ఈ క్రమంలో రెండో కుమారుడు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా చేయాలని ఆమె పట్టుబట్టింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం వారు మరోసారి గొడవపడ్డారు. మనస్థాపం చెందిన మెజాన్ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. వాటర్ క్యాన్లు రవాణా చేసే అబ్బాయి ఇంటి వద్దకు క్యాన్ ఇచ్చేందుకు రాగా.. ఇంటి లోపల వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని గమనించి, స్థానికులకు సమాచారం అందించారు. వెంటనే ఇంటి లోపలికి వెళ్లి కొన ఊపిరితో ఉన్న బాధితురాలిని కిందికి దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స అందిస్తున్నా పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్లు తాలూకా పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

కేసీ కాలువలో పడి మహిళ మృతి



చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం వద్ద గల కేసీ కాలువలో ఆదివారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికుల సమాచారంలో పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దువ్వూరు మండలం మదిరేపల్లెకు చెందిన మహిళగా గుర్తించారు. అమ్మిరెడ్డి వీరారెడ్డి భార్య అమ్మిరెడ్డి నాగలక్షుమ్మ(40)గా కనుగొన్నారు. ఆమె కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతుండేది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం దువ్వూరు వద్ద గల కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయింది. చాపాడు మండల పరిధిలోని మొర్రాయిపల్లె కాలువ ద్వారా విశ్వనాథపురం వద్ద కేసీ కాలువలో మృతదేహం బయటపడింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

సాయిబాబా ఆశయాలు కొనసాగిద్దాం


మాట్లాడుతున్న ఏపీసీఎల్‌సీ జిల్లా కార్యదర్శి రవిశంకర్

రాయచోటి అర్బన్ : ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని ప్రజా సంఘాల నేతలు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో విద్యావేత్త, మేధావి ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాయిబాబా దేశప్రజలు, దేశాన్ని ప్రేమించడం వల్లనే పాలకులకు కంటగింపుగా తయారయ్యారన్నారు. దేశంలో అణగారిన ప్రజలు, ఆదివాసీలు, మహిళల హక్కుల పరిరక్షణ కోసం పోరాడినందునే ఆయనపై పాలకులు కుట్ర పన్ని కేసు బనాయించారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.యల్.నరసింహులు, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్ మాట్లాడుతూ 90 శాతం వికలాంగుడైన సాయిబాబా తన మేధస్సుతో ప్రజలను చైతన్య పరిచారన్నారు. ఆయన మరణానికి భారత ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఉపా చట్టాన్ని వెంటనే రద్దు చేసి జైళ్లలో మగ్గుతున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్, ఏపీసీఎల్‌సీ జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, రైతు సంఘం నేత రంగారెడ్డి, బహుజన రక్షణ సమితి నేతలు నాగార్జున, మధు, బీసీ సంఘం నేత ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.